క్లుప్తంగా

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి



బోస్ కాలనీలో కార్యదర్శి సుజాతకు సూచనలిస్తున్న డీపీఓ ఎస్.రామనాథరెడ్డి

కాళ్ల: గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.రామనాథరెడ్డి అన్నారు. కాళ్ల మండలం మాలవానితిప్ప, ఎస్సీ బోస్ కాలనీ గ్రామాల్లో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై చేపడుతున్న చర్యలను గ్రామ కార్యదర్శి సీహెచ్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారిశుద్ధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు మంతెన శ్రీనివాసరాజు, సాగిరాజు సుబ్బరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలి



ఎల్ఎన్ పురంలో యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాళ్ల: ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ పట్టాభిరామయ్య అన్నారు. కాళ్ల మండలం ఎల్ఎన్ పురంలో గురువారం యూటీఎఫ్ రణభేరి పోస్టర్ను ఆవిష్కరించారు. మూల్యాంకన పద్ధతిలో ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన మార్పులు ఉపసంహరించుకోవాలని, విద్యాశక్తి కార్యక్రమం స్వచ్ఛందమని చెప్పి, బలవంతంగా అమలు చేయడం మానుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, ఉపాధ్యాయులు మోజెస్, సత్యనారాయణ, కిషోర్, సీతాదేవి, సూర్యనారాయణరాజు, కుమార్, రాంబాబు, కృష్ణమూర్తి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ఉండి: కూటమి ప్రభుత్వంలో అవినీతి పాలన జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు కఠినచర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని యండగండి వినియోగదారుల సంఘ కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి అధికారంలోకి వస్తే రీసర్వేను రద్దు చేస్తామని చెప్పి, గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం సరికాదన్నారు. అంతేకాకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రీసర్వేపై రైతుల ఫిర్యాదులు స్వీకరించారని అన్నారు. కానీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే తప్పులతడకగా ఉందన్నారు. మా కుటుంబానికి చెందిన 59 సెంట్ల భూమి కొలతల్లో తేడాలు వచ్చాయని అన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. సంక్షేమ పథకాలంటూ ప్రజలకు ఉచితంగా నగదు పంపిణీ చేస్తే వారు ఓట్లు వేయరు అనే సంగతి గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల కల్తీ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా విజిలెన్స్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది నెలలు అవుతుందని అధికారులు వెంటనే కల్పించుకుని సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు గోపాలకృష్ణంరాజు తెలిపారు.

ఇంటర్ విద్య కీలకం



ఎంపీ సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంటర్మీడియెట్ విద్య విద్యార్థుల జీవితంలో కీలకమని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంపీ పాకను కళాశాల పాలకవర్గం సత్కరించింది. కళాశాల అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బీడే సత్యనారాయణ, కోశాధికారి వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ను పునరుద్ధరించాలి

నరసాపురం రూరల్: 2003 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులు అందరికీ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. పాత పింఛన్ సాధనకు రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ అయితం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు శ్యాంసన్, గోపి, ప్రకాష్, గంటా మురళి తదితరులు పాల్గొన్నారు.

భౌ'బోయ్.. కరిచేస్తున్నాయ్!

- రైల్వే స్టేషన్కు వెళ్లాలంటే హడలిపోతున్న ప్రజలు
- గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు
- పట్టించుకోని రైల్వే అధికారులు





భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో టిక్కెట్ కౌంటర్ క్యూలైన్లలో పడుకున్న కుక్కలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం టౌన్ రైల్వే స్టేషన్కు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఏక్షణంలో దాడి చేస్తాయె తెలియక మహిళలు, చిన్నారులు ఒంటరిగా నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇటీవల పట్టణంలో అత్యధికంగా వీధి కుక్కలు పెరిగిపోయాయి. కుక్కలు పెరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో వాటి సంఖ్య పెరిగిపోయింది. ప్రతి వీధిలోనూ గుంపులుగా కుక్కలు సంచరించడంతో ఎవరిని కురుస్తాయో అని ఒంటరిగా వెళ్లకుండా ఇద్దరు, ముగ్గురు సహాయంతో వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. ప్రతి చోట వీధి కుక్కలు సంచరిస్తుండటంతో పిల్లలను స్కూళ్లకు, బయటకు పంపేందుకు తల్లిదండ్రులు హడలిపోతున్నారు.

పట్టించుకొని రైల్వే అధికారులు:
స్టేషన్లో కుక్కల తిరుగుతున్న కూడా రైల్వే అధికారులు పట్టించుకొవడం లేదు. టిక్కెట్ కౌంటర్ క్యూలైన్లలో పడుకుని ప్రయాణికులు క్యూలైన్లల్లోకి వెళ్లకుండా చేస్తున్నాయి. ప్రయాణికులపై కుక్కల దాడి ప్రమాదం పొంచి ఉందని గ్రహించి ఇప్పటికైన రైల్వే అధికారులు రైల్వే స్టేషనల్లో కుక్కల తిరగకుండా తగు చర్యలు తీసుకొవాలి.

త్వరగా చర్యలు తీసుకోవాలి



భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో సంచారం అధికంగా పెరిగిపోయింది. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల సంచారాన్ని అరికట్టేందుకు వీలైనంత త్వరగా అధికారులు చర్యలు తీసుకోవాలి

ఎ.వెంకటేశ్వరరావు భీమవరం

రైల్వే స్టేషన్కు వెళ్లాలంటే భయమేస్తుంది



టౌన్ రైల్వే స్టేషన్లో కుక్కలు ఎక్కడబడితే అక్కడ తిరుగతున్నాయి. దీంతో మహిళలు, చినపిల్లలతో వచ్చేవారు కుక్కల వల్ల భయపడుతున్నారు. ఇప్పటికే వీధుల్లో కుక్కలు దాడులు పెరుగుతున్నాయి. ఇప్పటికైన స్టేషన్ అధికారులు కుక్కలు లేకుండా చూడాలి.

సీహెచ్. భవానీ భీమవరం

నేడు సారథ్యం యాత్ర

భీమవరం: భీమవరంలో శుక్రవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎస్ మాధవ్ సారథ్యంలో జరుగునున్న యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. భీమవరం బీజేపీ కార్యాలయంలో గురువారం సారథ్యం యాత్ర ఏర్పాట్లపై పార్టీ నాయకులతో చర్చించారు.

చినఅమిరంలో ఇండియన్ బ్యాంక్ ప్రారంభం



చినఅమిరంలో ఇండియన్ బ్యాంక్ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: చిన్న అమిరం జేపీ రోడ్డులో ఇండియన్ బ్యాంకు నూతన బ్రాంచిని గురువారం ప్రారంభించారు. ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేష్ కుమార్, జోనల్ మేనేజర్ కే రాజకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ ఎం బాలకృష్ణ మాట్లాడుతూ ఖాతాదారులు మారిన బ్రాంచ్ని గమనించి బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరి సూర్య సత్యనారాయణ, చింతలపాటి సత్యనారాయణ రాజు, కాకులపాటి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ

పాలకోడేరు: మండలంలో గుర్రపు డెక్క ద్వారా వర్మి కంపోస్టు తయారు చేయుటకై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా మండలంలోని గొల్లలకోడేరు గ్రామంలో ఎస్ డబ్ల్యూ పీఎంషెడ్లో ప్రస్తుతం ఈప్రక్రియ జరుగుతుందని అదేవిధంగా పాలకోడేరు, గరగపర్రు గ్రామంలో కుడా ఎస్డబ్ల్యూ పిఎం షెడ్ ద్వారా వర్మి కంపోస్ట్ తయారు చేయుటకు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, డ్వాక్రా ఏపీఎం, డ్వాక్రా సీసీలు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్స్లకు అవగాహన, శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు బి. గోపి, కె. అన్నపూర్ణ శ్రీదేవి, డ్వాక్రా ఏపీఎం ఏ.భారతి, సీసీలు వరలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థులు

నరసాపురం రూరల్: రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు నరసాపురం మండలం ఎల్బీచర్ల ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. గురువారం ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎం గోపీచంద్, వై మహిమారాజులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం శ్యాంప్రసాద్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు భరోసా ఏదీ?

- మేనిఫెస్టో హామీలను విస్మరించిన చంద్రబాబు
- నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఉండిలో తాపీ పనిచేస్తున్న గృహనిర్మాణ కార్మికులు (ఫైల్)

ఉండి: ఎన్నికలు వచ్చాయంటే చంద్రబాబు నోటి వెంట అనేక పథకాలు, హామీలు అవలీలగా వచ్చేస్తాయి. అన్ని వర్గాల వారిని మోసం చేయడానికి అనేక సంక్షేమ పథకాలు టీడీపీ మేనిఫెస్టోలో చేరుతాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు రోజూ పనులు దొరికేవి. రెండు పూటలో కుటుంబం కడుపు నిండా భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుక పేరుచెప్పి అధిక ధరలకు అమ్మకాలు సాగించడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అనేక విభాగాల వారికి పని కరువైంది. ఉండి నియోజకవర్గంలో సుమారు 14వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. తాపీపని, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటర్, పెయింటర్, రాడ్ బైండింగ్, సెంట్రింగ్, టైల్స్, మార్బుల్స్, కంకర, ఇసుక, గోతులు తవ్వేవారు, ప్లాస్టర్ పారిస్ సీలింగ్, మట్టి పని చేసేవారు అనేక విభాగాలు వారు పనిచేస్తున్నారు.

● పోస్టుకార్డుల ఉద్యమం.
అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా స్వయంగా చంద్రబాబు, పవన్కల్యాణ్ చేసిన వాగ్దానాల అతీగతీ లేకుండా పోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని బతుకులకు అండగా ఉంటామంటే నమ్మామని, నమ్మినందుకు ఇలా చేయడం ఏమంత సబబుకాదని కార్మికులు పోస్టుకార్డు ఉద్యమానికి తెరలేపారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఆయా మండలాల వారీగా చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాల్లో వందల సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చేసిన వాగ్దానం వారికి గుర్తు వచ్చేలా పోస్టుకార్డులు వారికి చేరే వరకు వారు స్పందించే వరకు పోస్టుకార్డు ఉద్యమం ఆగదంటూ కార్మికులు ప్రతిజ్ఞ చేశారు.

నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు(సుమారుగా)

ఉండి మండలంలో	3 వేల మంది
ఆకివీడు	4 వేల మంది
పాలకోడేరు	4 వేల మంది
కాళ్ళ	3 వేల మంది

● వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
భవన నిర్మాణ కార్మికులైన తాపీ పని, వడ్రంగి, పేయింటర్స్, ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్, ఇటుకబట్టీ కార్మికులు, హెల్పర్స్,సెంట్రింగ్ పనివారు ఇలా సుమారు 14 వేల మంది ఆయా రంగాల్లో పని చేస్తున్నారు. వారందరి సంక్షేమ కోసం కూటమి ప్రభుత్వం రాగానే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి



గత ఎన్నికల్లో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్లు భవన నిర్మాణ కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటి వరకు వాగ్దానం అమలు చేయలేదు. ఇప్పుడైనా కష్టజీవులైన భవన నిర్మాణ కార్మికులకు మేలు చేస్తూ వాగ్దానం అమలు చేయాలి.

శేషాద్రి శ్రీనివాస్,భవన నిర్మాణ కార్మికులకు మండలాధ్యక్షుడు

నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి



కూటమి నాయకులు చేసిన వాగ్దానాన్ని నమ్మి తామంతా ఓట్లు వేసాము. కూటమి ప్రభుత్వాన్ని నమ్మిన కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వాగ్దానం అమలు చేయాలి. ఎంతమంది భవన నిర్మాణ కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మాకు వేల్ఫేర్బోర్డు అండగా ఉంటుందని ఆశపడుతున్నారు. కష్టజీవులకు అండగా కూటమి ప్రభుత్వం నిలబడి వాగ్దానం నెరవేర్చాలి.

ఏడిది సతీష్,భవన నిర్మాణ కార్మికులకు మండల కార్యదర్శి,ఉండి

25న ప్రభుత్వంపై ఉపాధ్యాయ రణభేరి



ఉపాధ్యాయ సమస్యలపై మ్రోగించనున్న రణభేరి కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించిన దృశ్యం

ఆకివీడు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వానికి తెలియజేసే విధంగా రణభేరి కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు మండల యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి ఆర్వీ.ఎస్. నారాయణ(విక్రమ్) చెప్పారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో రణభేరి పోస్టర్ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా విద్యా రంగ సమస్యలపై ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఒత్తిడిలేని వాతావరణం పాఠశాలల్లో కల్పించాలని, ఉమ్మడి సర్వీసుల నియమాల ద్వారా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రణభేరికి రంగం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం త్వరగా జరగాలని, డీఏలు, బకాయిలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నట్లు విక్రమ్ వివరించారు. ఈ మేరు రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఐదు ఉపాధ్యాయ దళాలు పర్యటించి, ఉపాధ్యాయుల్ని ఉద్యమానికి సిద్ధం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



దొంగపిండిలో హైస్కూల్లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: బాలికలకు వివాహాలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని భీమవరం సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, ఫోక్సో చట్టంపై కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే సమాచారం ఇవ్వాలని వివాహం చేసిన వారు, సంబంధం కుదిర్చిన పెద్దలపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, లైంగిక వేధింపులకు పాల్పడితే ఫోక్సోచట్టం అమలు ఉందన్నారు. విద్యార్థినులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. బాలికల్లో వచ్చే ఎనీమియా (రక్తహీనత) గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు డి. అనిల్కుమారి, అంగన్వాడీ టీచర్స్ కనకరత్నం, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్సీ వైద్యులు సరాబు సునీల్

కాళ్ల: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులను అశ్రద్ధ చేయవద్దని కాళ్ళ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ సునీల్ పేర్కొన్నారు. కాళ్ల మండలం జక్కరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్య అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్(ఎస్టిఐహబ్) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామీణ పేద వర్గాలు తమ జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలంటే సంపూర్ణ ఆరోగ్యం అవసరమని సూచించారు. వ్యాధులపై అశ్రద్ధ వద్దని, వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మావతి, ఎస్టి ఐ హబ్ కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సీహెచ్ రామబద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

చేలల్లోని ఎలుకలను సామూహికంగా మట్టుపెట్టాలి



యండగండి వరిపొలాల్లో ఎలుకల నివారణ చర్యలపై వివరిస్తున్న ఏఓ శ్రీనివాస్



గునుపూడిలోని పంట పొలంలో ఎలుకల బొరియలు మూస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తాయని వాటిని సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ అన్నారు. భీమవరంలోని గునుపూడి గ్రామంలో గురువారం పంట చేలల్లో ఎలుకలు బొరియలు మూసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించాలన్నారు. ఆయకట్టు రైతులందరూ పంట చేలల్లో మొదటి రోజు ఎలుకలు బొరియలు మూయడం వల్ల మరుసటి రోజున అవి మూసుకున్న బొరియలను తెరుస్తాయని వాటి వద్ద ఎలుకల మందు (బ్రోమోడిలిన్) కలిపిన నూకల పొట్లంను పెడితే వాటిని తిని మృతి చెందుతాయన్నారు. ఆయకట్టులోని కొంతమంది రైతులు ఎలుకల మందును పెట్టి కొందరు పెట్టకపోతే మందు పెట్టని పొలాల్లో ఎలుకలు దాక్కుని వృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం ఉచితంగా వ్యవసాయ ఆధారిత గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలలో ఎలుకల మందు కలిపిన నూకలను రైతులకు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపడితేనే మేలు

ఉండి: మండలంలో వరిసాగు చేసే రైతులంతా కలసి సామూహికంగా ఎలుకల నివారణ చేపడితేనే వరిసాగుకు మేలు జరుగుతుందని ఎలుకబారి నుంచి కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉండి మండలంలోని యండగండి, పెదపుల్లేరు, ఉండి, చెరుకువాడ, ఉప్పులూరు, వాండ్రం, పాందువ్వ తదితర గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వరిపొల్లాల్లోని ఎలుకల రంధ్రాలను గుర్తించడం వాటిని మట్టితో పూడ్చడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ గురువారం గుర్తించి పూడ్చివేసిన రంధ్రాల్లో ఏఏ రంధ్రాలు తిరిగి తెరువబడి వున్నాయో వాటిల్లో ఎలుకలు ఉన్నట్లు గుర్తించాలన్నారు. శుక్రవారం ప్రతి రైతు సేవాకేంద్రంలో ప్రభుత్వం రైతులందరికీ ఉచితంగా పంణీ చేసే బ్రోమోడయోలిన్ అనే మందును పెట్టాలని సూచించారు. రైతులంతా శుక్రవారం జరిగే సామూహిక ఎలుకల నివారణను చేపట్టాలని ఏఓ సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అభినందనీయం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శేఖర్రాజు సత్కరిస్తున్న డీఈవో

భీమవరం: వ్యాయామ ఉపాధ్యాయునిగా క్రమశిక్షణ, అంకితభావంతో పని చేస్తున్న శేఖర్రాజు కష్టానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణ అన్నారు. భీమవరం పట్టణంలోని ఎస్సీహెచ్బీఆర్ఎమ్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శేఖర్రాజు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం స్కూల్లో ఏర్పాటుచేసిన అభినందన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శేఖర్రాజు రోప్ స్కిప్పింగ్, మల్లఖంబ్, క్రికెట్ తదితర క్రీడల్లో ఎంతోమందిని క్రీడాకారులగా తయారు చేసి జాతీయ, రాష్ట్రస్థాయిల్లో పలు విజయాలు పురస్కారాల సాధనలో కీలకపాత్ర వహించారన్నారు. ఈకార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సంయుక్త కార్యదర్శి కూనపరాజు రామకృష్ణంరాజు, చిలుకూరి కుమార దత్తాత్రేయవర్మ, పిఆర్ కెఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.